

కథా కౌముది

పొగడ పూలు — ఆర్.సి.కృష్ణస్వామి రాజు

'ఎండగాని నీడగాని యేమైనగాని,

కొండల రాయుడె మా కుల దైవము...'

–మైకులో వీనుల విందైన అన్నమయ్య కీర్తన అలలుఅలలుగా వినిపిస్తోంది.

తిరుమలలో ఒక పొగడ చెట్టు కింద కూర్చుని కీర్తన వింటోంది చెంచులక్ష్మి . పొగడ పూల వాసన ఒక వైపు, అన్నమయ్య కీర్తన మరో వైపు... ఆకాశంలో తేలిపోతున్నట్లు ఉంది ఆమెకు.

దారినపోయే భక్తురాలు భర్తని అడిగింది. 'ఈరోజు స్వామి విగ్రహం ఇంకా చూడాలనిపించేట్లుగా ఉందండీ" అని.

"ఈరోజు శుక్రవారం.. స్వామికి అభిషేకం జరిగే రోజు. అందుకే స్వామి ధగధగా మెరిసిపోతున్నాడు" అని బదులిచ్చాడు.

'అందుకే... రెండు కళ్ళూ చాలలేదు స్వామివారిని చూడటానికి' అంటూ ఆ భక్తురాలు ముందుకు నడిచింది.

చెంచులక్ష్మి కూర్చున్నది పెద్ద మట్టి దిబ్బ కాబట్టి తిరుమల కొండలోని చాలా వీధులు చక్కగా కనిపిస్తున్నాయి. అప్పుడే కోసిన నల్లనేరేడు పండ్లలా తారు రోడ్లు మిలమిలా మెరుస్తున్నాయి.

'పాలు పోసి పాలు ఎత్తుకునేట్లు ఉన్నాయి కదా ఈ శేషాచలం కొండ వీధులు... ఇంత శుభ్రతకు కారణం అధికారుల కొండ నిర్వహణ, పాకీ పని చేసే వారి అంకిత భావం' అనుకుంది.

ఇంటర్ దాకా చదివిన ఆమె, తిరుమల కొండపైన పర్మినెంటు కాని పాకీ పని ఉద్యోగం చేస్తోంది. తిరుపతినుంచి గంట సేపు ప్రయాణిస్తే వచ్చే బొజ్జనత్తం గ్రామం ఆమెది. తెల్లారి ఊరినుంచి బస్సెక్కి కొండకి వచ్చి పని చూసుకుని రాత్రికంతా ఆమె ఇంటికి వెళ్ళిపోతుంది.

XXXXXX

బాగా అలసిన చెంచులక్ష్మి ఆరోజు రాత్రి ఇంట్లో పడుకుని ఉంది. కూతురు కోకిల అమ్మను లేపింది. ఏమని అడిగింది చెంచులక్ష్మి.

"దోమలు కుడుతున్నాయి" అని చెప్పింది కోకిల.

"గుడ్ నైట్ వెలిగించి పడుకో!" అని చెప్పింది.

"నాన్నకు ఆ వాసన పడదు కదా! అందుకని గుడ్ నైట్ వెలిగించలేదు" అని బదులిచ్చింది.

ఏమి చేయాలో తెలియక లేచి కూర్చుంది చెంచులక్ష్మి.

అప్పుడే ... బాగా నిద్రపోతున్న మొగుడు మహేష్ ముక్కులోకి దోమ దూరింది. అంతే... చటుక్కున లేచి కూర్చున్నాడు. కసుక్ కసుక్ మని తుమ్మి 'గుడ్ నైట్ కాయిల్ వెలిగిస్తే ఒక బాధ, వెలిగించకపోతే ఒక బాధ' అంటూ మళ్ళీ పడుకున్నాడు.

"సరే...ఊర్లోని రాములవారి గుడి వరకు అలా నడిచి వద్దాం, చల్లటి గాలికి బాగా నిద్ర పడ్తుంది. దోమలు కుట్టినా నొప్పి తెలియదు మనకు" అని చెప్పి కూతురిని తీసుకుని వీధిలోకి వచ్చింది.

'జుయ్' మని వీధి కాలువ చుట్టూ ఉన్న దోమలు సర్రుసర్రున తిరుగుతున్నాయి. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. దాన్ని చూసిన చెంచులక్ష్మి మనసు బాధగా మూల్గింది. 'ఎవరి ఇంటి ముందరి చెత్త వారు తీసేస్తే ఈ సమస్య ఉండదు కదా' అనుకుంది.

ఇద్దరూ నడుచుకుంటూ రాములవారి గుడికాడికి చేరారు. ఊరంతా నిద్రలోకి జారుకుని ఉంది. అక్కడ ఉన్న పొగడ పూల చెట్టు కింద కూర్చున్నారు. నేల మీద పడి ఉన్న పొగడ పూల వాసన గుమగుమలాడుతోంది. అమ్మాకూతురు వెండి వెన్నెల్లో కూర్చుని మంచిచెడ్డలు మాట్లాడుకుంటున్నారు.

ఒక దోమ ఎగురుకుంటూ వచ్చి చెంచులక్ష్మి ఎడమ చేయి మీద వాలింది. దోమను చూసిన కోకిల "అమ్మా, దోమ" అని అరిచి చేత్తో దోమను కొట్టింది. దోమ చచ్చింది కానీ కోకిల చేతికి రక్తం అంటుకుంది.

'మన రక్తం ఎంత తాగుతున్నాయో ఈ పాడు దోమలు' నల్లబడిన ముఖంతో చెప్పింది కోకిల.

'ఇక్కడ కూడా దోమలు ఎక్కువున్నాయి. ఇక ఇంటికి పోదాం పద' అంటూ చెంచులక్ష్మి బయలుదేరింది. అమ్మ వెనుకే కూతురు నడిచింది. ఇద్దరూ చిన్నగా నడుచుకుంటూ ఇంటికి చేరారు.

కాళ్ళకు, చేతులకు కొబ్బరి నూనె రాసుకున్నారు. దోమలు నూనె శరీరం మీద నిలవలేక జారిపోతాయని వారి ఉద్దేశ్యం. దోమల దాడిని ఎదుర్కోవాలని గట్టిగా దుప్పటి కప్పుకుని పడుకున్నారు.

XXXXXX

సూరీడు తూర్పు దిక్కుకు వచ్చి చాలా సేపయ్యింది.

శనివారం కావడంతో ఇంటింటా వెంకటేశ్వర స్వామి సుప్రభాతం రసరమ్యంగా వినిపిస్తోంది.

క్యారియర్ సర్దుకుని పరుగులు తీస్తూ బస్ కోసం రోడ్డు మీదికి చేరింది. అప్పటికి తను ఎక్కాల్సిన బస్సు రాలేదు. మద్రాసు నుంచి తిరుమల కొండకు నడిచి వెళ్ళే భక్త బృందం అక్కడ ఆగి ఉంది. వారు పెద్ద మర్రిమాను కింద కూర్చుని తెచ్చుకున్న ఆహార పొట్లాలు విప్పి తింటూ ఉన్నారు.

అక్కడ ఊరి పోస్ట్ మ్యాన్ మూడో కొడుకు మునివేలు నిలబడి ఉన్నాడు. తింటున్న బృందానికి ఇంటినుంచి తెచ్చిన బిందెలోని నీళ్ళు వారికి అందిస్తూ ఉన్నాడు.

"ఎలా ఉన్నావు మునివేలు? చాన్నాళ్ళయ్యింది నువ్వు కనబడి..." అని అడిగింది చెంచులక్ష్మి.

"ఏమి బాగులే అక్కా... ఒకటి పోతే ఒకటి వస్తా ఉంది. ప్రశాంతత లేదు బతుక్కి" అని బదులిచ్చాడు.

"ఏమయ్యింది నీకు? వేదాంతం మాట్లాడతా ఉన్నావే?" అని మళ్ళీ అడిగింది.

కొంచెం లుంగీ ఎత్తి ఎడమ పాదం చూపించాడు.

పాదం దగ్గర బాగా ఎర్రబడి, వాచి ఉంది. 'ఏమిటది' అని అడిగింది.

"ఏనుగు కాలు" అన్నాడు.

"ఇంకా ఏనుగు కాలు జబ్బు పీడ మన ఊరిని వీడలేదా?" అని అడిగింది.

"ఊర్లో ఎక్కడ మురికి నీళ్ళు అక్కడే నిలిచి పోతున్నాయి. వాటికి తోడు వాన నీళ్ళు వచ్చి వాటిలోకి చేరుతున్నాయి. వాటిలో దోమలు కుప్పలుకుప్పలుగా కాపురముంటున్నాయి. అవి కుట్టే నాకీ జబ్బు వచ్చింది" కీర గొంతుతో చెప్పాడు.

ఆమె బాధగా 'అవునా' అని సమాధానమిచ్చింది.

ఇంతలో తిరుపతి బస్సు రాగా ఆమె ఎక్కి కూర్చుంది. 'భద్రం బాబూ' అంటూ అతడికి చేయి ఊపింది. ఆమెలో ఆలోచనలు మొదలయ్యాయి. గాలివేగం కన్నా ఆమె ఆలోచనల వేగం ఎక్కువగా ఉంది.

XXXXXX

సర్రుసర్రుమని బస్సు గంట సేపటికే అలిపిరి చేరింది.

ప్రయాణీకుల సంచుల్ని చెకింగ్ చేస్తూ ఉన్నారు సెక్యూరిటీ సిబ్బంది.

అక్కడే నిలబడి ఉన్న వివిధ ప్రాంతాల ప్రజల హావభావాలను, భాష వస్త్ర ధారణలను చూస్తూ ఉంది చెంచులక్ష్మి.

ప్రక్కనే, అలిపిరి చుట్టూ ఇరవైమంది యువకులు గోతాలు చేత బట్టుకుని తిరుగుతూ కనిపించారు. వారు ఏమి చేస్తున్నారా అని పరిశీలనగా చూసింది. చెత్త కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, పనికిరాని వస్తువులన్నిటినీ వారు గోతాముల్లో వేసుకుంటూ ఉన్నారు. వారు కూలీల్లా లేరు. బాగా చదువుకున్నవారిలా ఉన్నారు. చేస్తున్న పనిని ఎంతో శ్రద్ధగా చేస్తున్నారు.

ఆసక్తిగా వారిని పలకరించింది. 'ఎవరు మీరు? ఏమి చేస్తున్నారు?' అని.

"మేము నంద్యాలకు చెందిన వాళ్ళం. మన ఊరు–మన గుడి–మన బాధ్యత' అనే సంస్థ మాది. వందకు పైగా వాలంటీర్లు ఇందులో ఉన్నారు. వారిలో ఎవ్వరూ డబ్బును ఆశించే వాళ్ళు లేరు. కొంతకాలంగా మేము కాశి, అరుణాచలం, శ్రీ శైలం, శ్రీ కాళహస్తి, తిరుమల వంటి పుణ్య క్షేత్రాలకు వెళ్తున్నాము. అక్కడి చెత్తనంతా తీసి వేస్తున్నాము. ముఖ్యంగా ప్లాస్టిక్ మా ప్రధాన శత్రువు" అని చెప్పారు.

వారి ఆదర్శ సేవకు ఆశ్చర్యపోయింది. 'నిజమే... ప్లాస్టిక్ అనేది ఎంత సౌకర్యాన్ని ఇస్తుందో, అంతకు మించి పర్యావరణాన్ని నాశనం చేస్తుంది' అనుకుంది.

చెకింగ్ అయిపోవడంతో బస్సు కొండపైకి బయలుదేరింది. ఆమె ప్రక్కనే ఉన్న కండక్టర్ " వారం రోజుల్లో నాలుగు టన్నుల చెత్తను వీళ్ళు సేకరించారు. వీళ్ళు అలిపిరి మాత్రమే కాదు, కొండ మీద శిలా తోరణం, వేద పాఠశాల, శ్రీ వారి మెట్టు నడక మార్గంలోని చెత్త కూడా తీసేశారు. అది సామాన్య విషయం కాదు " అని చెప్పాడు.

డ్రైవర్ కలగజేసుకుని " జపాన్ దేశంలో అయితే బడికి వచ్చిన విద్యార్థులు 'వచ్చామా, వెళ్ళామా...' అన్నట్లుగా ఉండరట. క్లాస్ రూమ్ లు, స్కూల్ పరిసరాలు వారే శుభ్రం చేసుకుంటారట. మన పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంటే... మనలో అంత ఉత్పాదక శక్తి పెరుగుతుందంట"అని చెప్పాడు.

మరింత ఆశ్చర్యపోయింది చెంచులక్ష్మి.

'పైసా ఆదాయం లేకున్నా, సొంత పనులను పక్కన పెట్టి పుణ్యక్షేత్రాల పరిసరాల్ని శుభ్రం చేసే గొప్ప ఆలోచన చేశారు వీళ్ళు' అనుకుంటూ శేషాచలం కొండవైపు చూసింది.

సరుక్కున మనసులో ఒక చిన్న ఆలోచన మెరిసింది. 'ఇదే పని నేను ఊర్లో ఎందుకు చేయకూడదు?' అని.

అంతే...

బస్సు దిగిందే నేరుగా పొగడ పూల చెట్టు దగ్గరికి చేరింది. కొండపైన తనతో పాటు పాకీ పని చేసే తమ ఊరి వారైన గీత, శాంతి లను అక్కడికి పిలిచింది.

'ఇన్ స్టాల్ మెంట్స్ లో చీరలమ్మేవాడు వచ్చినాడేమో... వెళ్ళి కొత్త చీరలు కొనుక్కుందామని' ఎగురుకుంటూ వచ్చారు వాళ్ళిద్దరూ.

ఇద్దరినీ కూర్చోబెట్టి అక్కడే ఉన్న టీ అంగడిలో అల్లం టీ తాగించింది.

చిన్నగా గొంతు సవరించుకుని–

"ఊరంతా చెత్తతో నిండిపోతోంది. దోమలు ఎక్కువై ఊర్లోవాళ్ళకు రోగాలు వస్తున్నాయి. వారానికొకసారి మనం ఊరి వీధులన్నీ శుభ్రంగా తోద్దాము, చెత్తను ఏరి పారేద్దాము. మనం ఇక్కడ చేసే పని కూడా అదే కదా!" అని అడిగింది.

శాంతి ముఖం ఎర్రబడింది. రుసరుసలాడుతూ "నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రేపోమాపో పెండ్లి చెయ్యాలి వాళ్లకి. నేనిలా ఊర్లు ఊడుస్తున్నానని తెలిస్తే నా బిడ్డలకి మంచి సంబంధాలు రావు. అంతేకాకుండా మా ఇంటాయన ఇలాంటి వాటికి ఒప్పుకోడు" అని గట్టిగా చెప్పి చటుక్కున మాయమైపోయింది.

'నీ ఆలోచన ఏమిటి?' అన్నట్లుగా శాంతి వైపు చూసింది చెంచులక్ష్మి.

తను కట్టిన కాటన్ చీర సర్దుకుంటూ శాంతి "నేను కొండపైన పని చేస్తున్నాని ఊర్లో వాళ్లకు తెలుసు కానీ, పాకీ పని చేస్తున్నానని తెలియదు. నువ్వు చెప్పినట్లు చేస్తే ఊర్లో వాళ్లకి అసలు విషయం తెలిసిపోతుంది. అలా ఊర్లోవాళ్ళకి తెలియడం అనేది నాకు ముఖం మీద పేడ కొట్టించుకున్నదానితో సమానం. నువ్వు చెప్పినట్లు చేస్తే ఊర్లో తల ఎత్తుకుని ఎలా తిరుగగలను? కాబట్టి నేను రానుగాక రాను. నీకిష్టముంటే నువ్వే చేసుకో " అని చెప్పి అక్కడినుంచి సరసరా వెళ్ళిపోయింది.

'సమస్యకు పరిష్కారం ఎలా ?' అని వాడినముఖంతో తల పైకెత్తి చూసింది చెంచులక్ష్మి. పొగడపూలు తనవైపు జాలిగా చూస్తున్నట్లుగా కనిపించాయి.

xxxxxx

ఆ రాత్రి కూతురు, మొగుడుల ప్రక్కన కూర్చుని మన ఊరిని మనమే శుభ్రం చేసుకుందామని, దానికి తానే నడుము బిగిస్తున్నానని' చెప్పింది చెంచులక్ష్మి.

ఆమె చెబుతూ ఉంటే చెంచులక్ష్మి మొగుడు లేచి వెళ్ళి నల్లకుండ దగ్గరకు వెళ్లి నిలుచున్నాడు. ఉడుతకెందుకు ఊర్లో పెత్తనం అంటాడని కొంచెం జడుసుకుంది. అయితే అలా జరుగలేదు.

చెంచులక్ష్మి మొగుడు చల్లటి కుండ నీళ్ళు తాగి మెరుపు కళ్ళతో " సంసారం కోసం లక్షలాదిమంది వచ్చే కొండ వీధులు ఊడ్చి కష్టపడుతున్నావు. మన ఊరిని మనమే శుద్ధి చేసుకోవాలనే ఆలోచన నీకు రావడం చాలా బాగుంది" అని ధైర్యం చెప్పాడు.

వెంటనే కూతురు కోకిల "మొన్నటికి మొన్న నా క్లాస్ మేట్ కి మలేరియా జ్వరం వచ్చింది. నాకు దోమలపైన విపరీతమైన కోపం వచ్చింది. ఏదో ఒకటి చేయాలనిపించింది. నేను కూడా వచ్చి నీతో వీధులు ఊడుస్తానమ్మా" అంది.

ఎనిమిది చదివే తన కూతురి మాటలతో చెంచులక్ష్మి మనసు తడి తమలపాకుతో తడిమినట్లయ్యింది.

అమ్మతో మాట్లాడేసి కోకిల వీధిలోకి పరిగెత్తింది. తను, తన అమ్మ ఆదివారం నాడు ఊరి వీధులన్నీ శుభ్రం చేస్తున్నామని చెప్పింది. వింతగా చూసినారు స్నేహితురాళ్ళు. వారు బదులిచ్చేది వినకుండా పరిగెత్తుకుంటూ వచ్చి పడుకుంది కోకిల.

మరుసటి నాడే ఆదివారం.

కోడి నాలుగు గంటలకే 'కొక్కోరోక్కో...' అని కూసింది.

అమ్మా కూతురు ముఖం కడుక్కుని తట్ట, బుట్ట, చేట, చీపుర్లు పట్టుకుని ఇంటి బయిటికి వచ్చారు.

అప్పటికే కోకిల స్నేహితురాండ్రు వారి ఇంటికి చేరి ఉన్నారు. ఆ అని నోరు తెరిచింది కోకిల. ఆ వచ్చిన వారిలో కొండపైన పాకీ పని చేసే గీత కూతుర్లు కూడా ఉన్నారు. వారందరూ తమ మూతులకు చున్నీలు చుట్టి ఉన్నారు. కన్నులతోనే ఎందుకలా చున్నీలు చుట్టారని చూపులతోనే ప్రశ్నించింది చెంచులక్ష్మి. మురికి కాలువలను చూపిస్తూ 'గబ్బు గబ్బు' అన్నారు.

చెంచులక్ష్మి నవ్వుతూ అందరినీ పలకరించింది.

అందరూ రాముల గుడికాడ ఉన్న పొగడపూల చెట్టు కిందకు చేరారు. అలికిడికి నిద్రపోతున్న వీధి కుక్కలు లేచి నిలబడ్డాయి. బాగా నీల్గి తోకలాడిస్తూ గుంపు దగ్గరికి వచ్చి చేరాయి.

అప్పుడే టప్ మని కరెంటు పోయింది.

'ఏమి చేద్దామబ్బా?' అని చెంచులక్ష్మి ఆలోచిస్తుండగా ఎవరో పెద్ద దీపం ఎత్తుకుని రావడం కనిపించింది. ఎవరా అని ఆసక్తిగా చూసింది చెంచులక్ష్మి. దగ్గరికి వచ్చేసరికి తెలిసింది ఆమె గీత అని. కొండ లడ్డు తిన్నంత సంతోషపడింది చెంచులక్ష్మి.

టపీమని కరెంటు వచ్చి వీధి దీపాలన్నీ మెరుపుల్లా మెరుస్తూ వెలిగాయి.

'ఎవరు ఏ వీధి ఊడుద్దాం?' అనుకుంటూ ఉండగా గజ్జెల శబ్దం మొదలయ్యింది.

అందరూ తల తిప్పి చూశారు.

ఒక చేత్తో పొడుగు వెదురు కర్రకి టెంకాయి కీతుల చీపురు చుట్టి పరుగులు తీస్తూ వస్తోంది శాంతి. ఆనందంతో చేయి విసిరింది చెంచులక్ష్మి.

సరసరా అందరి ఇండ్లలోని దీపాలు గబగబా వెలిగాయి.

'ఏమి జరుగుతోందా...' అని ఇండ్లలోని వాళ్ళు వీధిలోకి వచ్చారు.

'ఆకాశంలోకి పూలు విసిరేస్తే పూలే మన నెత్తిన పడుతాయి. మంచి ఆలోచనలు చేస్తే అంతా మంచే జరుగుతుంది' అన్నట్లుగా వున్నాయి వారి ముఖాలు.

'వాళ్ళందరూ ఊరిని శుభ్రం చేయడానికి వస్తూ ఉంటే... మనం సినిమా చూస్తున్నట్లు చూస్తూ ఉండటం ఏం బాగుంటుంది?" అని ఎవరో గట్టిగా అరిచారు.

అంతే... అందరూ గబగబా ఇండ్లలోకి వెళ్ళి తామూ ఓ చేయి వేద్దామని చీపుర్లు తీసుకు వచ్చారు.

చెంచులక్ష్మి బృందం వీధులు ఊడ్చడానికి బయలుదేరారు. అప్పుడే చల్లగా వీచిన గాలికి పొగడపూలు వారి నెత్తిన రాలాయి. దూరంగా తిరుమల కొండ నవ్వుతున్నట్లుగా ఉంది. ★★★

COMMENTS